ప్రజాశక్తి

సోమవారం 29 ఏప్రిల్ 2024 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

మోసాల బాబును నమ్మొద్దు

వెంకటగిరి బహిరంగ సభలో వైఎస్. జగన్ మోహన్ రెడ్డి

వెంకటగిరి సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- వెంకటగిరి : మోసాల బాబును నమ్మొద్దని రాష్ట్ర ఆపధర్మ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి వెంకటగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా వెంకటగిరిలోని త్రిభువని సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాడిపత్రిలో సభ ముగించుకొని నేరుగా వెంకటగిరి విశ్వోదయ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సభ స్థలానికి హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 సంవత్సరం ఇదే కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందా అంటూ సభికులను ప్రశ్నించారు. ఆ సమయంలో నారా చంద్రబాబు సంతకంతో ఇచ్చిన హామీలను చదివి వినిపించారు. రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తాను అధికారంలోకి వస్తే మరోసారి తాను ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని తెలిపారు. మరో రెండు వారాల్లో జరిగే ఎన్నికల్లో ప్రతి అక్కచెల్లెమ్మలు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేడుకున్నారు. వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థిడాక్టర్ గురుమూర్తికి చేరొక ఓటు వేసి 175 స్థానాలకు 175 స్థానాలు గెలిచే విధంగా అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి అసెంబ్లీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులు, ప్రజలు

నేడు తిరుపతికి బీవీ రాఘవులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో 29వ తేదీ జరిగే పలు కార్యక్రమాల్లో సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పాల్గొంటారని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక యశోదానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 29వ తేదీ సోమవారం ఉదయం యశోదానగర్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో సిపిఐ అభ్యర్థి పి.మురళి ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థి అయిన మురళి, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి చింతా మోహన్ విజయానికి ప్రజలంతా సహకరించాలని కోరనున్నారని పేర్కొన్నారు. సాయంత్రం 5.30గంటలకు వేమన విజ్ఞానకేంద్రంలో ఎన్నికలు నేటి పరిస్థితి అనే అంశంపై జరుగుతున్న సెమినార్లో ఆయన పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఆయనతోపాటు మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు కూడా పాల్గొంటున్నట్టు వారు తెలిపారు. అలాగే తిరుపతిలో జరుగుతున్న అరాచకాలు ప్రజలను కలవరపెడుతున్నాయని వారు వాపోయారు. ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో వైసిపి, జనసేన శ్రేణుల మధ్య ఘర్షణకు దిగి తిరుపతి ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రజాసమస్యల మీద ఏమాత్రం శ్రద్ధ లేని వీరు ఒకరి మీద ఒకరు దాడులు చేసుకుంటూ ఇద్దరు కలిసి బిజెపి పంచన చేరడం తిరుపతి లాంటి యాత్రస్థలంలో నష్టమని తెలిపారు. తమ పార్టీ తరపున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రజలంతా బివి.రాఘవులు పర్యటన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలను వారు విజ్ఞప్తి చేశారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

దళిత ద్రోహి జగన్

పేదలకు ఉన్నత, విదేశీ విద్య దూరం : హైకోర్టు న్యాయవాది మహేశ్వరరావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దళితులను అన్నివిధాలా అణగదొక్కిన ద్రోహి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఆయన శ్రీకాళహస్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలంటూ కపట ప్రేమ చూపిన జగన్ వారి జీవితాలను ప్రణాళికాబద్ధంగా నిర్వీర్యం చేశాడంటూ మండిపడ్డారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు దశబ్దాలుగా విద్యపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ లాగా లక్షల కోట్ల అక్రమ ధనం, వేలాది ఎకరాల ల్యాండ్ బ్యాంకులు పేదల చేతుల్లో లేవనీ, కేవలం విద్యాపథకాలతో ఉన్నత చదువులు చదివి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలియజేశారు. అయితే జగన్ సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉన్నత విద్యను, విదేశీ 2 లో

తిరుమలలో పెరిగిన రద్దీ

దర్శనానికి 20 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల యాత్రికులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లలో యాత్రికులు శ్రీవారి దర్శనం కోసం వేచి చూస్తున్నారు. కాగా టికెన్లు లేని వారికి దర్శనానికి ఖచ్చితంగా 18 నుంచి 20గంటల సమయం పడుతోందని, రూ.300ల ప్రత్యేక దర్శనానికి సుమారు 5 నుంచి 6 గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు. శనివారం స్వామివారిని 81,212 మంది దర్శించుకున్నారని తెలిపారు. అందులో 32,403 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించారన్నారు. తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు వచ్చాయని టీటీడీ అధికారులు వెల్లడించారు.

ఏనుగుల స్వైర విహారం

- రెండున్నర ఎకరాల మామిడి పంట నష్టం

2 లో

జగన్ కుట్రలను భగ్నం చేస్తాం

- రాష్ట్రాన్ని మధ్యాంధ్రప్రదేశ్‌గా
- డ్రగ్స్యాంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు జగన్ సిద్ధం
- రేణిగుంట బహిరంగ సభలో బాలయ్య ఫైర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రానున్న ఎన్నికల్లో జగన్ టక్కు టమార.. గజకర్ణ గోకర్ణ.. కుట్రలన్నిటినీ భగ్నం చేస్తామని హిందూపురం ఎమ్మెల్యే, టిడిపి, జనసేన, బిజెపి కూటమి స్టార్ క్యాంపెయినర్ నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని మధ్యాంధ్రప్రదేశ్‌గా, డ్రగ్స్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేందుకు జగన్ 'సిద్ధం'గా ఉన్నాడంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలకృష్ణ ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. అక్కడ నిర్వహించిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడారు. జగన్ సిద్ధం.. సిద్ధం.. అంటూ సభలెందుకు పెడుతున్నాడో జనాలకు అర్థం కావట్లేదని విమర్శలు చేశారు. సిద్ధం సభలకు రూ.1600 కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశాడంటూ ఆరోపణ చేశారు. రాష్ట్రంలో మద్యాన్ని నిర్మూలించేందుకు జగన్ సిద్ధమా అని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జగన్ సిద్ధమా..!! అన్నారు. అమరావతి రైతులకు న్యాయం చేసేందుకు జగన్ సిద్ధమా..! అంటూ ఎద్దేవా చేశారు. తల్లికి..చెల్లికి.. బాబాయ్‌కి న్యాయం చేసేందుకు నువ్వు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. ముఖ్యంగా నాసిరకమైన మద్యం, డ్రగ్స్ కు అలవాటు పడి జీవితాలు కోల్పోతున్న యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు నువ్వు సిద్ధమా జగన్ అంటూ ప్రశ్నించారు. ఇవన్నీ చేయలేని నువ్వు ప్రజల్ని దేనికి సిద్ధం కావాలని పిలుపునిస్తున్నావో చెప్పాలని ప్రశ్నించారు. తెలుగు ప్రజల ఆకాంక్షల 2 లో

(మొదటి పేజీ తరువాయి)

దళిత ద్రోహి జగన్

విద్యను దూరం చేశాడని ధ్వజమెత్తారు. ఒక్క జీవోతో లక్షా 40వేల మంది పేదలను బెస్ట్ అవైలబుల్ స్కూళ్ళనుంచి తీసేసి రోడ్డున పడేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని తీసేసి జగనన్న విదేశీ విద్యా పథకం పేరుతో అర్హులకు బదులు అనర్హులను అందలమెక్కించాడంటూ దుయ్యబట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లను మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన కాకుండా సగం సీట్లను అమ్ముకునే విధంగా జగన్ జీవో తీసుకొచ్చి పేదలకు అన్యాయం చేశాడని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీల ఫీజు రియంబర్స్మెంట్‌లు, స్కాలర్‌షిప్లు, పదోన్నతుల్లో కూడా కోత పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు భూములు స్థలాలు కూడా ఉండకూడదనే దురుద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షా 47వేల ఎకరాల భూములను జగనన్న కాలనీల పేరిట బలవంతంగా లాక్కొని నయా పైసా కూడా పరిహారం జగన్ చెల్లించలేదని వాపోయారు. దళితులను సామాజికంగా, ఆర్థికంగా బతకనీయని జగన్ చివరికి మనిషిగా కూడా బతకకూడదనే కక్ష్యతో దళితుడిని హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు లాంటి వారిని వెనకేసుకు రావడం ఆయన కుటిల నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. దళితులను హత్య చేసిన వారిని, దళితులకు శిరోమండనం చేసిన వారికి జగన్ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం నిజంగా సిగ్గుచేటని విమర్శించారు. జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీలపై సాగించిన అరాచకాలను ఎండగడుతూ సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తున్నామని వివరించారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, రెడ్డప్ప, ఎస్.రాము, వేదముత్తు, న్యాయవాది పులి పుష్పలత, అల్లం మణి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం రావొద్దు: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఏప్రిల్ మాసానికి సంబంధించిన సామాజిక భద్రత పింఛన్లు మే నెలలో పంపిణీ చేయునవి రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్యాంకు అకౌంట్ ఉన్న వారికి వారి ఖాతాలోకి నేరుగా మే ఒకటో తేదీన జమ చేయడం జరుగుతుందనిజిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతా లేని వారికి, డిబిటి ఫెయిల్ అయిన వారికివారి ఇంటి వద్దకే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా మే ఒకటో తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని, ఎవ్వరూ సచివాలయానికి పింఛన్ల కొరకు వ్యయ ప్రయాసలకోర్చి రావాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే బ్యాంక్ అకౌంట్‌లేని వారి కొరకు, డిబిటి ట్రాన్సక్షన్ ఫెయిల్ అయిన వారి కొరకు సంబంధిత ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు సదరు బ్యాంకుల నుండి పెన్షన్ నగదును ఈనెల ఏప్రిల్ 30 తేదీననే విత్‌డ్రా చేసి సిద్ధంగా అందుబాటులో ఉంచుకుని నిబంధనల మేరకు పంపిణీకి చర్యలు చేపట్టాలని సూచించారు. మేనెల ఒకటో తేదీ నుండి మూడు తారీఖు సాయంత్రం లోపు మే నెలకు అందాల్సిన పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 100శాతం పింఛన్ల పంపిణీ మూడు రోజుల్లోపు పూర్తి చేస్తామని వారు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

1న సివిల్ సర్వీస్ పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన సివిల్ సర్వీస్ పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సీనియర్ మేనేజర్ అనంత కష్ణసాయి తెలిపారు. స్థానిక సత్యసాయి నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం అని విలేకరులతో మాట్లాడుతూ నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'పాత్ టు సివిల్ సర్వీసెస్- ఇన్సైడ్స్ అండ్ స్ట్రాటజీస్' పేరుతో మే ఊటవ తేదీ మహతి ఆడిటోరియంలో సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక మాజీ చీఫ్ సెక్రటరీ కె. రత్నప్రభ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివత్తి చేస్తారని తెలిపారు. రత్నప్రభ రచించిన కలెక్టరమ్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈకార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

2 నుంచి పీఓలు, ఏపీఓలకు శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్

పజాశక్తి- చిత్తూరు అర్బన్:సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించే పిఓలు, ఏపిఓలు, ఓపిఓలకు సంబంధించిన రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నగరి అసెంబ్లీ, జీడీ నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు (ఎస్‌సి), పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్ షాదిక్ అలం రాజకీయ పార్టీల సమక్షంలో పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్దేశిత వెబ్‌సైట్‌లో పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను అబ్జర్వర్లు, రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1,889 మంది పిఓలు, 1,993 మంది ఏపిఓలు, ఓపిఓలు 7,961 మంది ర్యాండమైజేషన్ ప్రక్రియ చేయడం జరిగందని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్తగా ఓపిఓలుగా అంగన్వాడి వర్కర్‌లను కూడా పోలింగ్ విధులకు అనుమతించడం జరిగందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పిఓ)తో పాటు ఒక (సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్) ఏపిఓ, నలుగురు (ఇతర పోలింగ్ అధికారులు) ఓపిఓ లు ఉంటారని పిఓలు, ఏపిఓలకు మే 3, 4వ తేదీలలో వారికి కేటాయించిన నియోజకవర్గాల ఆర్ఓ సమక్షంలో పోలింగ్ నిర్వహణ పై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మే 2న మైక్రో అబ్జర్వర్‌లకు నాగయ్య కళాక్షేత్రంలో శిక్షణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ శివయ్య, డిఐఓ సుధాకర్ రావు, అడిషనల్ డిఐఓ భాను ప్రకాష్, వెంకటేశ్వర రావు, టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్, ఐఎన్‌సి భాస్కర్, వైసిపి ఉదయ కుమార్, బిజేపి అట్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులు అవగాహనతో ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పీఓల విధులకు సంబంధించి సెక్టోరియల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీలతో కలసి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2024 సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మే 12న ఎన్నికల సామగ్రి పంపిణీకి సంబంధించి, 13న పోలింగ్, పోలింగ్ తర్వాత నిర్వహించాల్సిన వివిధ అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, తహశీల్దార్లుకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మనకు ఇంకా 10 రోజులు మాత్రమే మిగిలి ఉందని, ఈ పది రోజులలో సెక్టోరియల్ అధికారులు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే ఆర్ఓల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అన్నారు. మే 11, 12, 13న సెక్టోరియల్ అధికారులు ఏమి చేయాలి ఏమి చేయకూడదని దాని పై పూర్తి అవగాహన కలిగి ఉండటంతోపాటు పిఓల విధులకు సంబంధించిన ప్రతి అంశంపై సెక్టోరియల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పిఓలు మాక్‌పోల్ నుండి పోలింగ్ పూర్తి అయ్యేవరకు విధులను జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. పిఓతో పాటుగా ఐదుగురు పోలింగ్ సిబ్బంది ఉంటారని, మైక్రో అబ్జర్వర్ వెబ్ కాస్టింగ్ వీడియో గ్రాఫర్ పోలీస్ సిబ్బంది ఉంటారన్నారు. అనంతరం 31మండలాలకు సంబంధించిన సెక్టోరియల్ అధికారులకు బియు, సియు, వివి ప్యాట్ల ద్వారా మాక్‌పోల్, వివిధ రకాల ఫామ్స్‌పై పూర్తి అవగాహన కలిగించారు. పూతలపట్టు, జి డి.నెల్లూరు, నగరి, పుంగనూరు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు చిన్నయ్య, వెంకట శివ, వెంకట్రారెడ్డి, మధుసూదన్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి,శ్రీనివాసులు, ఈవియంల మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ శ్రీదేవి, ట్రైనింగ్ నోడల్ అధికార్లు డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్ కె.రబ్బానీ బాషా, చిత్తూరు నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ, తహశీల్దార్ల తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

(మొదటి పేజీ తరువాయి)

జగన్ కుట్రలను భగ్నం చేస్తాం

మేరకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారని గుర్తు చేశారు. టిడిపి పార్టీ కాదనీ, ప్రజల ఆస్తి అని వెల్లడించారు. టిడిపికి ఉన్న కార్యకర్తల సంఖ్య ప్రపంచంలో ఏ పార్టీకి లేదని కితాబిచ్చారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ళు అన్న నినాదంతో ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారనీ, 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయాంలో ప్రపంచమే గర్వించదగ్గ సంస్కరణలను టీడీపీ తీసుకొచ్చిందన్నారు. మహిళలకు ఆస్తిలో వాటా, భూమిశిస్తు రద్దు, రూ.1కే బియ్యం, తెలుగు ప్రాజెక్టు లాంటి ప్రాజెక్టులు ముఖ్యమైనవని వివరించారు. ఆయన వారసుడిగా టిడిపి సారధ్య బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోటీపడిందనీ, అయితే జగన్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశాడంటూ మండిపడ్డారు. గాడి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని తిరిగి అభివృద్ధి పథం పట్టించాలంటే అది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి సాధ్యపడుతుందని వివరించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏనుగుల స్వైర విహారం

రెండున్నర ఎకరాల మామిడి పంట నష్టం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి, రాయల్‌పేట నాగిరెడ్డిపల్లి మొదలగు పంచాయతీలు సమీప అటవీ ప్రాంతాల గ్రామాలకు అవడంతో రైతులు సాగు చేస్తున్న పంటలపై ఏనుగులు స్వైర విహారం చేస్తూ రైతుల కష్టాన్ని బుగ్గిపాలు చేస్తున్నాయి. మండలంలోని పెదకాపల్లి పంచాయతీ ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీ.సుబ్రహ్మణ్యం తన రెండున్నర ఎకరా భూమిలో మామిడి పంట సాగుచేసి ప్రతి సంవత్సరం వచ్చే ఆదాయం పైన కుటుంబ జీవనం సాగిస్తూ ఉండేవాడు. పంట దిగుబడి బాగా ఉందని సంతోషపడుతున్న రైతుకు శనివారం రాత్రి ఏనుగులు గుంపు అతని మామిడి తోట పైకి వచ్చి పంట ధ్వంసం చేశాయని రైతు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ వృద్ధ దంపతులు రాలిన కాయలు ఏరుకుంటూ వారి బాధను వ్యక్తపరిచారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు పంట ప్రాణనష్టం జరిగినప్పుడు హడావుడి తప్ప తర్వాత తీసుకున్న చర్యలు శూన్యమని సమీప గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల్లో నుంచి గ్రామ పరిసరాల్లోకి పంట పొలాల్లోకి ఏనుగులు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సమీప రైతులు కోరుతున్నారు.

టీడీపీకి చక్రాల ఉష రాజీనామా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చక్రాలు ఉషా ఆ పార్టీకి అదివారం రాజీనామా చేశారు. రేణిగుంట పర్యటనకు విచ్చేసిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ పర్యటనకు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్ రెడ్డి నుండి ఎలాంటి ఆహ్వానం లేకపోవడంతో తానీ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. మహిళలంటే గౌరవం లేని సుధీర్ లాంటి వ్యక్తుల వద్ద తాను ఇమడలేనని ఆమె తెలిపారు. తన భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

ముదిరాజుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ముదిరాజ్ సామాజికవర్గ ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో ఆదివారం నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 500 మంది వైసీపీ సానుభూతిపరలైన ముదిరాజ్‌లు టీడీపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు.

మోసానికి మరో రూపమే జగన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మోసానికి మరో రూపం సీఎం జగన్ అని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు విమర్శించారు. పాత హామీలకే మళ్ళీ రంగులు పూసి ప్రజలను మోసం చేశాడని మండిపడ్డారు. బిసి వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికలలో అప్పటికే ఉన్న 34 శాతం రిజర్వేషన్లకు కోత పెట్టి 10 శాతం తగ్గించి రాష్ట్ర వ్యాప్తంగా 16వేల మంది బిసిలకు వివిధ పదవులను దూరం చేసిన ఘరానా మోసగాడు జగన్ రెడ్డి అని ఉమేష్ ఆరోపించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ డీజీ, ఎన్నికల అధికారి అమృత్‌రాజ్ కోరారు. గంగాధర నెల్లూరు మండలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఓటర్లు పోలింగ్ వేయడానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా గత ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తిన ముక్కళత్తూరు, కాళేపల్లి, పాచిగుంట పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీజీ పరిశీలించారు. స్థానిక అధికారులతో సమస్యలున్న బూత్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన మహిళ ఆదర్శ పోలింగ్ కేంద్రం విభిన్న ప్రతిభా వంతుల పోలింగ్ కేంద్రం , స్ట్రాంగ్ రూం, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలను అందించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని , ఎవరైనా అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నీచ సంస్కృతి జగన్‌ది: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వివేక హత్యను తన ఎన్నికల ప్రచారానికి వాడుకున్న నీచ సంస్కృతి జగన్ ది అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన అరాచక పాలన అంతం – కూటమి పంతం ఎన్డీఏ చార్జ్ షీట్ ' అనే కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటినుండి సీఎం జగన్ తన అరాచక పాలనతో రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేశారన్నారు. వివేకానంద రెడ్డి హత్యకు గురి అయితే సిబిఐ ఎంక్వయిరీ వేయించ కుండా తప్పించుకుంటున్నారన్నారు. వివేక హత్యను తన ఎన్నికల ప్రచారానికి వాడుకున్న నీచ సంస్కృతి జగన్ ది అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ప్రజా సంక్షేమ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా పదవి రావడంతో బాలసుబ్రమణ్యం అనుచరులు కండువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ మధు, విజయలక్ష్మి, ఖాజా పాల్గొన్నారు.

గిరిపురం ఘటన ప్రణాళిక బద్ధమే: వాసు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కూటమి పార్టీ అభ్యర్థి ఆరని శ్రీనివాసులు ఉద్దేశపూర్వకంగానే ప్రణాళికలు వేసుకుని గిరిపురంలో వైసిపి ప్రచారాన్ని అడ్డుకొని వివాదం సృష్టించారని తిరుపతి టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసు యాదవ్ ఆరోపించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో ఏనాడూ ప్రచారాలలో ఇలాంటి ఘర్షణ వాతావరణం జరగలేదని, కూటమి అభ్యర్థి శ్రీనివాసులు చిత్తూరు రౌడీయిజం సంస్కృతిని తిరుపతిలో చూపడం భాగ్యం కాదన్నారు. 'తమ ప్రచారాలను తాము చేసుకోకూడదా?' అని ప్రశ్నించారు. తిరుపతిలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో బాలాజీ, అరుణ్ యాదవ్, కోదండ, చంద్ర, ప్రకాష్, కోటి, వినోద్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టివేత

ఎఫ్ఎస్‌టి అధికారి ఇబ్రహీం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: అక్రమంగా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎఫ్ఎస్‌టి అధికారి ఇబ్రహీం అన్నారు. ఆదివారం బంగారుపాళ్యం టోల్గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి రేణిగుంటకు వెళ్తున్న వాహనంలో రూ.254700 కలిగి ఉండడంపై నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఖజానా శాఖ సెలవు కావడంతో నగదును భద్రపరిచేందుకు సంబంధిత పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మయ్య దగ్గర ఉంచినట్లు ఎఫ్ఎస్‌టి అధికారులు తెలిపారు. నగదును సోమవారం ఖజానా శాఖకు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ముస్లింలు మేలుకోవాలి

ముస్లింనేత ఖాద్రి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ ఎన్నికలు ముస్లిం సమాజా నికి ఎంతో కీలకమైనవని, రాష్ట్రం లోని యావత్తు ముస్లిం సోదరులు పార్టీలకు అతీతంగా చైతన్యవంతులై మతోన్మాద కూటమికి వ్యతిరేకంగా ఏకపక్షం గా ముస్లింలకు అండగా నిలిచే వైసీపీకి ఓటు వేసి గెలిపిం చాలని వైసిపి మైనారిటీ రీజనల్ కో ఆర్డినేటర్ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పిలుపు నిచ్చారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే సీఏఏ ద్వారా ముస్లింలను దేశం నుండి తరిమి కొట్టడానికి కుట్ర పన్నుతోందని, సీఏఏ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ లో అమలు చేయబోమని అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసు కుంటే ఆ నిర్ణయానికి 151 ఎమ్మెల్యేలు మాత్రమే సంతకం చేశారని, మిగిలిన 23 మంది టిడిపి, జనసేన ఎమ్మెల్యే ఒకరు సంతకాలు చేయలేద న్నారు. దీన్ని పరిశీలిస్తే ముస్లింల పట్ల ఈ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధి బయటపడు తోందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా

మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనారిటీ విభాగం అధికార ప్రతినిధి ఖాదర్ బాషా, అబ్దుల్ కపూర్, ఎస్ఎం భాష, ఎస్.మహమ్మద్, షేక్ సలీం, సయ్యద్ సులేమాన్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారాల్లో మార్పొచ్చింది: పెద్దబ్బ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తాను 1980 దశకం నుండి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని ఏనాడు రాజకీయ ప్రచారాల్లో వివాదాలు నెలకొనకుండా ఎంతో హుందాగా అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి ఓటును అడిగే వారమని, నేడు ఆ పరిస్థితులు లేవని పూర్తిగా మార్పు వచ్చిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి(పెద్దబ్బ) అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం తిరుపతి గిరిపురంలో జరిగిన ఘటనలో తాను ప్రత్యక్షంగా పరిశీలించిన అంశాలను మీడియాకు వివరించారు. గంజాయి సేవించిన యువత ఎదుట ఉన్నది ఎవరో గుర్తించలేని పరిస్థితుల్లో దాడులకు తెగబడ్డారన్నారు. తిరుపతిలో ఏనాడు లేని ఈ గంజాయి సంస్కృతిని పెంచి పోషిస్తోంది ఎవరో తిరుపతి ప్రజలందరికీ తెలుసు అన్నారు. సహనాన్ని పరీక్షించే ప్రవర్తన ఎవరికి మంచిది

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవనారాయణరెడ్డి

కాదని, కవ్వింపు చర్యలు ఇకనైనా మానుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలాగా రాజకీయ పక్షాలు వ్యవహరించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో సిద్ధారెడ్డి, మోహన్, విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

బాలకృష్ణ రోడ్‌షో

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఆదివారం సినీ నటుడు బాలకృష్ణ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభ పూర్తి అయిన తర్వాత తిరుపతి మార్గంలో వెళుతూ బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి నాయకులు ఆహ్వానం మేరకు బుచ్చినాయుడు కండ్రిగ బస్టాండ్ ఆవరణలో నాయకులను కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు బాలకృష్ణకు గజ పూల మాలలతో, శాలువాలతో, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో సినీ నటుడు బాలకృష్ణ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి తనకన్నా పెద్ద నటుడు అని, రాయి తగిలి పెద్ద గాయమైనట్లు నటించావని ఆయన అన్నారు. అమరావతి రాజధాని కాకుండా విశాఖపట్నం రాజధాని చేస్తానని ఊరికే రాష్ట్రం అభివృద్ధి లేకుండా అక్కడ రాజధాని పెడతాం ఇక్కడ రాజధాని పెడతామంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టిడిపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న శాసనసభ్యులుగా కోనేటి ఆదిమూలంను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలగపల్లి వరప్రసాదను గెలిపించాలని కోరారు. బాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలకృష్ణ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గంగవరం: ద్విచక్ర వాహనం, లగేజ్ ఆటో ఢీకొనడంతో జీవన్ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెద్దపంజాణి మండలం నిడిగుంట గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు జీవన్ మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఇంటికి కావలసిన సరుకుల కోసం పలమనేరు పట్టణానికి తన భార్య సుజాతతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతూ ఉండగా గంగవరం మండలం చెన్నారెడ్డిపల్లి క్రాస్ వద్ద లగేజ్ ఆటో ఢీకొనడంతో జీవన్ అక్కడికక్కడే మృతి చెందారు. భార్యకు తీవ్ర గాయాలు కావడంతో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీవన్‌కు ఇద్దరు కుమార్తెలు శ్రావణి, గాయత్రి ఉన్నదని తండ్రి తమకు దూరమై తల్లి ఆసుపత్రి పాలు కావడంతో పిల్లలు అనాథలు అయ్యారని గ్రామస్తులు తెలిపారు.

అదుపుతప్పి ఇంటిపైకి దూసుకెళ్లిన కారు

- యువకుడు మృతి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి పక్కనే ఇన్న ఇంటిపైకి దూసుకెళ్లి యువకుడిని ఢీకొని చెట్టును ఢీకొన్న సంఘటనలో గంగ (25) అనే యువకుడు మృతి చెందారు. సీఐ సురేష్ కథనం మేరకు ఏర్పేడు నుంచి నగరికి వస్తున్న కారు ధర్మాపురం వద్ద కారు టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంటిపైకి దూసుకెళ్లి యువకుని పైనుంచి వెళ్లి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంతో గంగ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఇతను చత్తీస్‌ఘఢ్‌కు చెందిన నెహ్రూ కుమారుడు, రాళ్లుకొట్టే పనినిమిత్తం ఇక్కడ బస ఉన్నాడు. కారు డ్రైవర్ సురేష్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎస్‌యులో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ విభాగంలో ఈరోజు 2023–24 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశం తీసుకున్న 200 మంది విద్యార్థులకు వారం రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర మొదలైన రాష్ట్రాల నుంచి విద్యార్థులు డిస్టెన్స్ లో ప్రవేశం తీసుకోవడం జరిగింది. ఈ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్–ఛాన్సలర్ మాట్లాడుతూ ఎవరైతే ప్రత్యక్షంగా విద్యను అభ్యసించడానికి అవకాశం లేదో ప్రత్యేకించి ఉద్యోగులు గాని, పెద్దవారు గానీ, లేదా ఇతర ఇతర సమస్యలతో ఉన్న వారందరూ కూడా ఈ డిస్టెన్స్ కేంద్రం ద్వారా సంస్కృతంలో ఉన్న గ్రంథాలను చక్కగా చదువుకొని ముందుకు వెళ్లాలంటే సత్సంకల్పంతో విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పూర్వకాలం ప్రారంభించారని, తద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నవిద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొంది తద్వారా వివిధ శాస్త్రాలలోని జ్ఞానసంపాదనకు ఇది చక్కని అవకాశం అని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సాహిత్య ఆచార్యులు ప్రొ.సి.రంగనాథన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ భరత్ భూషణ్ రథ్, డిస్టెన్స్ విభాగంలోని అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో తెలుగు గంగ నీరుస్తా: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ ప్రజలకు తెలుగుగంగ నీరు ప్రతి ఇంటికి అందిస్తానని, తిరుమల నగర్ పంచాయతీలో ఉన్న సర్వే ట్రెనింగ్ అకాడమీ స్థలాన్ని మార్చుచేసి ఆ స్థలంలో స్థానిక పేద ప్రజలకు టిడ్కో ఇళ్లు కట్టిస్తానని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఆదివారం మంగళం పరిధిలోని మంగళం పంచాయతీలో ఐదీవల టిడిపిలో చేరిన సతీష్(నాని) ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నాయకత్వం సహకారంతో సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన పులివర్తి నాని మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రకృతి వనరులను ఎమ్మెల్యే ఇష్టాను సారంగా దోచుకుని వేలకోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. అధిక ధరలకు నాసిరకం మద్యం తరఫరా చేస్తూ పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో వైసిపి ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. ఈ సందర్భంగా 200 మంది యువకులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ టిడిపి అధ్యక్షులు ఈశ్వరయ్య, తిరుపతి రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు రామాంజేరి మహేశ్వరి, కడియాల రమణ, జేబీ శ్రీనివాస్, గణపతి నాయుడు, ఏబీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా భూముల సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం: నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం శ్రీనివాసపురంలో టిడిపి నేత సర్పంచ్ గణపతి నాయుడు ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న 240, 241, 242 సర్వే నెంబర్లు నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు.తుమ్మలగుంటలో 32 ఎకరాలు ఆక్రమించి అందులో ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేరట 2.5 ఎకరాల మఠం భూమి ఎలా రిజిస్టర్ చేశారు. శ్రీనివాసపురంలోని భూములను ఎందుకు నిషేధం కొనసాగుతుందని నిలదీశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

IN THE COURT OF THE Prl., SENIOR CIVIL JUDGE COURT OF SRIKALAHASTHI
E.P.NO: 3/ 2020, O.S.NO: 142/2009

BETWEEN:
B. Vamsi Kiran .....D.Hr.
And
1. A. Munirathnam Reddy
2. A. Bhagyalakshmi
3. A. Chakridhar
4. A. Himabindu
5. A. Ankamma ..... J.Dr.

Notice to the J.Dr.

To
1. A. Munirathnam Reddy, S/o A. Venkata Reddy
2. A. Bhagyalakshmi, W/o A. Munirathnam Reddy
3. A. Chakridhar, S/o A. Munirathnam Reddy
4. A. Himabindu, D/o A. Munirathnam Reddy
5. A. Ankamma, W/o A. Venkata Reddy
All are residing at Madibaka Village, Yerpadu Mandal, Tirupati District.

Please take notice that the Petitioner/ Decree holder has filed the above execution petition against you and it is posted to 09-05-2024 for your appearance before this Hon'ble court at 10.30 am on 09-05-2024 either in person or through your advocate and file your objection if any. If you fail to appear before the above Hon'ble court on the above date the above petition will be decided exparte.
Hearing date: 09-05-2024 at 10:30am.

A. Sudhakar Reddy, BA, B.L,
B. Usha Kiran, B.A.B.L,
Advocates Srikalahasti.

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
సోమవారం 29 ఏప్రిల్ 2024

సార్వత్రిక రణభేరి

మేమున్నాం.. మీకు తోడుగా..!

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

- రండి.. ఓటేయండి.. ప్రజలకు పోలీసుల పిలుపు
- ఓటర్లల్లో ధైర్యం నింపుతున్న పోలీసుల కవాతు
- దశల వారీగా ఓటరు అవగాహన కార్యక్రమాలు
- ముమ్మరంగా వాహన తనిఖీలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో ఫోకస్

ప్రజాశక్తి-పూతలపట్టు: ఓటర్లు తమ ఓటు హక్కును ప్రలోభాలకు గురికాకుండా తమ ఇష్టమైన పార్టీకి ఓటు వేసుకునే అవకాశం కల్పించడానికి పోలీసు శాఖ తీవ్రంగా కృషి చేస్తోంది. గ్రామాల్లో రహస్య సమాచారాల మేరకు తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం నిలువలను పట్టుకుని కేసులు బనాయిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పూతలపట్టు మండలంలో దశలవారీగా సమస్య ఆత్మక గ్రామాల్లో సిఐ సుదర్శన్ ప్రసాద్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో సిఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా సంకల్పించాలన్నారు ఇందులో భాగంగా ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజల్లో భరోసా కల్పిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు పోకూడదని సూచించారు. అలాగే ఎన్నికలవేళ అక్రమ మద్యం, డబ్బు ఎన్నికల తాయిలాలు అక్రమంగా తరలించకుండా జాతీయ రహదారిపై ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మారు సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం పటిష్ట భద్రత, బందోబస్తు నిర్వహిస్తోంది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలను పోలీసు కవాతు రూపంలో అవగాహన కల్పిస్తోంది. పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశాలను నిర్వీర్యం చేయడానికి భారీ ఎత్తున వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. అనుమానం ఉన్న గృహాల్లో సైతం తనిఖీలు చేస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలే లక్ష్యంగా..

సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక కవాతు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పూతలపట్టు, గొడుగు చింత, పోలవరం, వావిల్ తోట, పి.కొత్తకోట, గ్రామాల్లో కవాతులు నిర్వహించారు. ఎన్నికలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తనిఖీలు ముమ్మరం..

జాతీయ రహదారిలోని తేనేపల్లి టోల్ ప్లాజా, కానిపాకం క్రాస్, ముత్తిరేవుల, అనుమానం ఉన్న మరిన్ని ప్రాంతాల్లో భారీగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరిని విచారిస్తున్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేసుకొని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏది ఏమైనా గత ఎన్నికల్లో కాకుండా ఈ మారు ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకునే విధంగా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.

'ఆరని'ది హత్యా రాజకీయాల నేపథ్యం

- ప్రశాంత తిరుపతిలో గుండాగిరి తగదు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఆరని శ్రీనివాసులది హత్యా రాజకీయాల నేపథ్యం అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుపతిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో గుండాగిరితో రాజకీయాలు చేయాలను కుంటే తస్మాత్ జాగ్రత్త ఆరని శ్రీనివాసులు, ఇలాంటి రాజకీయాలను తిరుపతి ఎన్నటికీ అంగీకరించదు అన్నారు. ఇలా వ్యవహరించే వారిని తిరుపతి తుడిచి పెట్టేసిందని దుయ్యబట్టారు. చిత్తూరులో హత్యారాజకీయ సంప్రదాయంలో పెరిగిన కలుపు మొక్క ఆరని శ్రీనివాసులు అని పేర్కొన్నారు. ప్రశాంతతకు నిలయమైన తిరుపతిలో అలజడులు సృష్టించేందుకు, గూండాగిరితో చేయాలని చూస్తున్న వ్యక్తి తిరుపతిలో అల్లర్లు లేకుండా చేస్తాడంట, పవిత్రతను కాపాడుతాడంట అని ఎద్దేవా చేశారు. తిరుపతి ప్రజలు చాలా మంచి వారు కాబట్టి ఓటుతో నీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

తిరుపతిలో కడప ఫ్యాక్షన్‌కు చోటు లేదు

- ఓటమి భయంతో గంజాయి బ్యాచ్‌తో గొడవలు
- నిందలు నాపైకా.. ఆరని శ్రీనివాసులు ధ్వజం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో కడప ఫ్యాక్షన్ రాజకీయాలకు చోటు లేదని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు స్పష్టం చేశారు. రాజారెడ్డి ద్వారా కడప సంస్కృతిని తిరుపతిలో గత 30ఏళ్ళుగా అమలు చేస్తున్నది నువ్వు కాదా అంటూ కరుణాకర్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. హత్యా రాజకీయాలు.. సెటల్మెంట్స్‌కు పెట్టింది పేరైన కరుణాకర్‌రెడ్డికి నన్ను విమర్శించే అర్హత లేదని శ్రీనివాసులు అన్నారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా 46,48 డివిజనల్లో క్లస్టర్ ఇన్చార్జ్ మబ్బు దేవనారాయణరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మొదటి నుంచి కరుణాకర్ రెడ్డి కడప ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తూ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తూ వస్తున్నారని ఆరని శ్రీనివాసులు చెప్పారు. ఎన్నికల సంఘం అనుమతితో తాము ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే గంజాయి బ్యాచ్‌ను పంపి గొడవలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, అన్నా రామచంద్రయ్య, జేబి శ్రీనివాస్, పొలకల మల్లికార్జున్, అన్నా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనధికార సోదాలపై టీడీపీ నేతల ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఫ్లైయింగ్ స్క్వాడ్ చిత్తూరు టీడీపీ ఎంపి అభ్యర్థి నివాసంలో అనధికారి సోదాలు చేపట్డంపై ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా అనధికార సోదాలు చేపడుతున్నారని అనధికార సోదాలపై ఈసీకి పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరి స్తున్నారని ముఖ్యంగా చిత్తూరు వన్‌టౌన్ సీఐ టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అనుచితంగా వ్యవహరిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు ఠాణా చెక్‌పోస్టు వద్ద సెల్‌ఫోన్లు లాక్కోవడం, వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. పోలీసులు, కొందరు అధికార్లు తీరుపై ఎన్నికల కమిషన్‌కు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గెలిపించండి.. అభివృద్ధి సాధిద్దాం..

- టీడీపీకి మహిళా ఆదరణ ఉంది
- ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజలందరూ ఆదరించి ఓటేసి గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధిని సాధించవచ్చని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపంజాణి మండలంలోని ముత్తుకూరు పంచాయతీలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి మహిళల ఆదరణ లభిస్తోందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని వారు కోరుతున్నట్లు తెలిపారు. ప్రజారంజక పాలన అందిస్తామన్నారు. మరింతగా ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. చేరిన వారిలో ఉగ్రాణం సుబ్రహ్మణ్యం, ఎం.మాధవరెడ్డి, దేవరాజు, కే.వెంకటరమణ, రామకృష్ణ, వై.వెంకట్‌రమణ, కే.సుబ్రహ్మణ్యం, కేశవ, రమేష్, మునిరాజు, సునీల్ కుమార్, కదిరెప్ప, గణేష్, గంగప్ప ఉన్నారు.

సంక్షేమ ఫలాల సారథి సీఎం జగన్: లలిత కుమారి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సంక్షేమ ఫలాల సారథి సీఎం జగన్మోహన్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. ఆదివారం బంగారుపాళ్యం మండలంలోని కూర్మాయిపల్లి, చిల్లగుండ్లపల్లి పంచాయతీలలో వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో ప్రవేశపెట్టిన నవరత్నాలకు అదనంగా నగదును జమ చేసి 2024 మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. చెప్పిన హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నవరత్నాల లో ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ఉన్నాయన్నారు. అనంతరం గడపగడపకు వెళ్లి ప్రచార కార్యక్రమం చేపట్టారు. రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, మాజీ సర్పంచ్ శరత్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ రెడ్డి, మహేంద్ర, రఘు కిషోర్ కుమార్ రెడ్డి, పాలక్షి రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించండి: భాను

సమావేశంలో మాట్లాడుతున్న మెరుపుల మహేష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కోరారు. ఆదివారం పుత్తూరులో జరిగిన ఎన్‌డీఏ కూటమి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు అంతం కావాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటేసి చంద్రబాబును మరో సారి సీఎంను చేసుకోవాల్సి బాధ్యత ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మెరుపుల మహేష్ మాట్లాడుతూ నగరిలో రోజాను ఇంటికి పంపడానికి జనసైనికులు, టిడిపి నాయకులు కలిసికట్టుగా పనిచేసి అత్యధిక మెజారిటీతో గాలి భానుప్రకాష్‌ను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో టిడిపి చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, డిఎన్ ఎలుమలై, షణ్ముగం రెడ్డి, పార్టీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, రూరల్ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, బిసిఆర్ యుగంధర్, ఎస్‌బిఆర్ పురం సర్పంచ్ మని రాజు, బొబ్బిలి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాంబేడులో థామస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయితీలో ఎన్నికల ప్రచారంలో జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వి.ఎం థామస్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వారు అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు లోకనాథ్ రెడ్డి, మోహన్ మురళి, నరసింహ యాదవ్, చెంగల్‌రాయల్ రెడ్డి, కిషన్, చందు, మోహన్ యాదవ్, యుగంధర్, ఈశ్వర్ రెడ్డి, విశ్వనాథ్ యాదవ్, సురేష్, గిరి కుమార్, ఉదయ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: ప్రతిమ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గురజాల ప్రతిమ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 16, 38డివిజన్ల పరిధిలోని దుర్గానగర్ కాలని, ఏఎస్‌ఎం స్ట్రీట్, తానప్పశెట్టి వీది, రాగిమాను వీది, రంగారెడ్డి స్ట్రీట్‌లలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ టిడిపి జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, ఈ రెండు చేయగల సత్తా ఉన్న విజనరీ లీడర్ చంద్రబాబుని సీఎం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి ఉమ్మడి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరారు.

ఓటర్లను అభ్యర్థిస్తున్న మోహిత్‌రెడ్డి

వైసీపీ పాలనలోనే అభివృద్ధి

- పనభాకం, సి.రామాపురంలో భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): వైసీపీ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ ప్రగతి జరిగిందని చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంద్రగిరి నియోజకవర్గంలోని పనపాకం పంచాయితీ, రామచంద్రపురం మండలాలలోని సి.రామాపురం గ్రామాలలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ స్కూటర్ ర్యాలీ నెన్నూరు వరకు నిర్వహించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెనూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. సంక్షేమం అభివృద్ధిని చూసి మళ్లీ సీఎం జగన్మోహన్ రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సర్పంచ్ పవన్‌కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, భానుకుమార్ రెడ్డి, కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరుతున్న పలువురు వైసీపీ నాయకులు

టీడీపీలోకి భారీ చేరికలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తిరుపతిరూరల్ మండలంలో పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నేతలు టీడీపీలో భారీగా చేరారు. హరిపురం కాలనీకి చెందిన వైసీపీ కీలక నేత, దామినేటి గంగయ్య ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో గంగయ్య వర్గీయులు విశ్వనాథన్, గుడితి నాగరాజు, లాయర్ వెంకటాద్రి (ఆనంద్ బాబు), సుబ్రహ్మణ్యం, బ్యాంక్ గిరి, హరీష్, రుక్మాంగ, నరేష్, కుమార్, ప్రకాష్, అయ్యప్ప, కుమార్, కార్తీక్, సుబ్బు తదితరులు చేరారు. శ్రీనివాసపురంకి చెందిన వైసీపీ మాజీ మండలపార్టీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మీ, వార్డ్ మెంబర్స్ పుష్పాలత, గంగులమ్మ, ప్రభావతి, మహేశ్వరి, పద్మావతిపురంకి చెందిన పి.రమేష్ బాబు, నరసయ్య, కౌశిక్, విష్ణు, హేమంత్, మహేష్, హరి, ధీరజ్, మాదేశ్, జానకిరామ్, తేజ తదితరులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా టిడిపిలో కొత్తగా చేరిన వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మా సొంత భూములకు కూడా రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. చంద్రగిరి అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని భావించి పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో బడి సుధాయాదవ్, వి.గణపతి నాయుడు, ఏ.ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసుల్లు, డి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరె హో.. హో..!

- ఎన్నికల జోరు.. మందుబాబులు బేజారు
- వైన్ షాపుల ఎదుట క్యూ కడుతున్న మద్యం ప్రియులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఓ వైపు పోలింగ్ దగ్గర పడుతున్న కొద్ది జిల్లాలో ప్రచారం ఊపందుకుంది. ఇదే తరహాలో మద్యం దొరక్క మందుబాబులు బేజారౌతున్నారు. మద్యం షాపు తెరిచిన గంట, అరగంటకు నోషాక్ట్ బోర్డులు పెడుతుండటంతో జిల్లాలోని వైన్‌షాపుల ఎదుట మద్యం ప్రియులు క్యూ కడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు మందు బాబులం.. మేము మందుబాబులం మందుకొటితే.. మాకు మేమే మహారాజులం అంటూ చిందులేసిన మందుబాబు నేడు మద్యం కోసం నానాపాట్లు పడుతున్నారు.

స్వారత్రిక ఎన్నికల నోటిఫికేషన్ తరువాత జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ఎన్నికల కమిషన్ కంట్రోల్‌లో నడుస్తున్నారు. నోటిఫికేషన్‌కు ముందు ఉదయం 11గంటలకు ప్రారంభమై సాయత్రం ఎనిమిది, తొమ్మిది గంటల వరకు నడిచే మద్యం దుకాణాలు ప్రస్తుతం నోస్టాక్ బోర్డులు పెడ్డి ఉదయం11.30, 12గంటలకే మూసేయడంతో ఉదయం 10గంటల నుంచి ఎప్పుడు మద్యం షాపులు తెరుస్తారా అంటూ మద్యం షాపుల ఎదుట మందు బాబులు క్యూ కడుతున్నారు. మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ పలు ఆంక్షలు అమలు చేస్తోంది. ఓ వ్యక్తి ఒక బాటిల్ మాత్రమే విక్రయించాలి. గతేది ఏప్రిల్ నెల ఒకటో తారీకు నుంచి నెల చివరి వరకు ఆ షాపులో ఎంత మద్యం అమ్మకం జరిగిందో అంతే విక్రయించాలి. రోజు వారి గతేది నెలవారి అమ్మకాల లెక్కల ప్రకారం రోజుకు ఎంత మద్యం అమ్మకం జరిగిందో అంతే స్టాక్ పంపుతున్నారు. ఎన్నికల వేల కావడంతో వచ్చిన స్టాక్ వచ్చినట్టే ఖాళీ అవుతోంది. ఎక్కువ సమయం మద్యం షాపులు నడిచేలా షాపు ప్రారంభంలో అధిక ధరలున్న మద్యం బాటిల్స్ విక్రయిస్తున్నారు. ఉదాహరణకు 120, 130 క్వాటల్స్ స్టాక్ లేదంటూ 250, 300 క్వాటర్ బాలిల్స్‌ను విక్రయిస్తున్నారు. ఖాళీ అయిన తరువాత తక్కువ ధర మద్యం విక్రయిస్తున్నారు.

బార్ల జోరు..

మద్యం షాపుల్లో నోస్టాక్ బోర్డులు పెట్టడంతో జిల్లాలో మద్యం విక్రయించే బార్లు సందడి సందడిగా కనిపిస్తున్నాయి. సిండికేట్‌గా మారిన బార్ల యజమానులు బీర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.40 పెంచి విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాలు నోస్టాక్ పెడుతుండటంతో మద్యం ప్రియులు బార్లను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. మరో వైపు బార్లలో విక్రయించే బ్రాండ్ల మద్యం, ఇతర ఆహార పదార్థలపై కూడా రెట్లు పెంచి విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు వాపోతున్నారు.

వైన్ షాపు వద్ద బారులు తీరిన మందుబాబులు

ప్రజారంజక మ్యానిఫెస్టో

- వైసీపీ జిల్లా అధ్యక్షులు భరత్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తమ పార్టీ ప్రకటించిన 2024 ఎన్నికల మ్యానిపెస్టో ప్రజా రంజకంగా ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షులు భరత్ తెలిపారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మ్యానిపోస్టోను జిల్లా అధ్యక్షులు భరత్, ఎంపి అభ్యర్థి రెడ్డిప్ప, ఎంఎల్‌ఏ అభ్యర్థి విజయానందరెడ్డి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రాహుల్ రాజారెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేలా తెలుగుదేశం మ్యానిపెస్టో విడుదల చేసిందని చేసేది చెబుతాం చెప్పిందే చేస్తాం అనేలా వైసీపీ ఎన్నికల మ్యానిపెస్టో ఉందన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రాంతీయ పార్టీ పెట్టి సోదర్ను గెలిపించుకొలేని మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఆర్థిక నిపుణులతో చర్చించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మ్యానిపెస్టో విడుదల చేయడం జరిగిందన్నారు.

మ్యానిపెస్టో విడుదల చేస్తున్న నాయకులు

బాల కార్మికులపై చర్యలు ఏవి..?

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: బండిని ఆపే శక్తి లేకపోయినా, బండిని ఆ బుడ్డోడిని చూసి ప్రజలు ఎంతో ఆశ్చర్యపోతున్నారు. కానీ ఎప్పుడూ ఎవరిని ఢీకొంటాడో..మూడు చక్రాలు ఆటో ఎక్కడ బోల్తా పడుతుందో తెలియని పరిస్థితి చూసేవారిని ఆశ్చర్య పరుస్తోంది. ప్రభుత్వం బాల కార్మికులను గుర్తించి వారు చదువుకునేందుకు చర్యలు తీసుకోవాలని చట్టాలు చెబుతున్నా, నిత్య వృత్తిగా తిరిగే ప్రాంతాల్లో వాటర్ క్యాన్లు మోస్తూ, అంత పెద్ద బండ్లను ఎలాంటి అర్హత, వయసు లేకపోయినా 'రయ్..రయ్..' మంటూ రోడ్లపై నేల బండ్లను నడిపిస్తున్నారు. గతంలో వయసు లేకుండా పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కొంత మంది ఆటోలు తోలుతూ ప్రమాదాలకు గురి చేసిన సందర్భాలూ లేకపోలేదు. ఇంతటి ప్రమాదాలు చోటుచేసుకున్న తర్వాత కూడా ఎదుటి వారిని ప్రమాదానికి గురిచేస్తే తప్ప కనిపించదా?' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విచ్చలవిడిగా వాటర్ క్యాన్లు ఆటోలను, ప్యాసింజర్ ఆటోలను నడుపుతున్న వయసు లేని, ఎలాంటి పత్రాలు లేని వాహనాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందాన ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందు జాగ్రత్త చర్యగా వాటర్ క్యాన్లు మోస్తున్న బాల కార్మికులను, మూడు చక్ర వాహనాల్లో, నాల్గు చక్రాల వాహనాలు నడుపుతున్న పిల్లలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని కొత్త వీరాపురం లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని, తిరుపతి పార్లమెంట్ ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తిని గెలిపించాలని కోరుతూ వైసిపి నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఏర్పేడు మండల ఇన్‌ఛార్జ్ గున్నేరు కిషోర్ రెడ్డి, ఆ పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ జనార్ధన్ యాదవ్, కో ఆప్షన్ బత్తి శెట్టి వైసిపి నాయకులు ప్రభు, గాండ్ల మురుగయ్య , బిల్లు రాంబత్తయ్య యాదవ్, మునిరత్నం నాయుడు, పల్లం కుమార్ రెడ్డి, సదాశివపురం వెంకటేశ్వర్లు, కొబాక చెంగల్రాయలు ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడే ప్రజా ఆశీర్వాద పాదయాత్ర

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగనబోయే ప్రజా ఆశీర్వాద పాద యాత్రను విజయవంతం చేయాలని ఎగువ వీధి సర్పంచ్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు బర్రి హేమ భూషణ్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2019 ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదం పొంది గెలిచినప్పటి నుంచి నేటి వరకు ప్రజాక్షేత్రంలో ఉంటూ ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా తానున్నానంటూ సేవ చేస్తున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో కూడా గెలిపించాలని కోరారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రజా ఆశీర్వాద పాదయాత్ర ప్రారంభమై ఎగువవీధి, అరుంధతి వాడ, హరిజనవాడ, కోట, దిగువవీధి తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు తొండమనాడు పంచాయతీలో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలిపారు.

ముద్దుకృష్ణమ నాయుడి అనుచరుడు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కెరోజా సమక్షంలో వడమాలపేట మండలం టిపి అగ్రహారానికి చెందిన టిడిపి నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడి అనుచరుడు వి రామచంద్రా రెడ్డి ఆదివారం వైసిపిలో చేరారు. వడమాలపేట మండలం టిపి అగ్రహారం ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వి మీనాక్షి, వి నరేంద్ర బాబు, వి వెంకటేష్ బాబులు కుటుంబంతో సహ టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఆర్‌కెరోజా వారికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

ఊసేలేని 'రుణమాఫీ'

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: రైతే రాజు.. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని వైసీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని గొప్పలు చెప్పుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శనివారం విడుదల చేసిన మ్యానిఫెస్టో కోసం ఎదురుచూసిన సన్న, చిన్న కారు రైతులకు నిరాశే మిగిలిందని రైతులు వాపోతున్నారు. జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన మ్యానిఫెస్టోలో కనీసం లక్ష రూపాయలు అయినా రుణమాఫీ చేస్తారని ఎదురు చూసిన సన్న, చిన్న కారు రైతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. బ్యాంకుల్లో పాస్ బుక్కులు తనఖా పెట్టి, పేదవాడు ఇంట్లో ఉన్న అంతో ఎంతో బంగారు తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని అప్పులు చేసి పంటలు పండించిన రైతులు పంటలు చేతికి అందక అప్పుల పాలు అవుతున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి రైతులను నట్టేట ముంచడం న్యాయం కాదని, ప్రభుత్వాన్ని నమ్ముకుని పంటను నమ్ముకుని రైతులు పూర్తిగా నష్టపోవడం చాలా బాధాకరంగా ఉందని రైతులు వాపోతున్నారు. కనీసం లక్ష రూపాయలైనా రుణమాఫీ చేస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశామని అయితే మ్యానిఫెస్టోలో మాత్రం ఎక్కడా రైతుల బాగు కోసం పట్టించుకోకపోవడం దారుణమని మండల రైతులు తెలిపారు. దీంతో పాటు జలకళ పేరుతో గత మ్యానిఫెస్టోలో ఉచితంగా బోర్లు వేసి మోటార్లు అమర్చి రైతుల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చినా మండలంలో ఏ ఒక్క రైతుకూ జలకళ ద్వారా బోరు చేసిన దాఖలాలు లేవని రైతులు వాపో యారు. డ్వాక్రా మహి ళలకు ఈ మ్యాని ఫెస్టోలో జగన్ మోహన్ రెడ్డి రుణ మాఫీ చేస్తా రని ఎంతో ఆశతో ఎదురు చూసిన మహిళ లకు నిరాశే మిగిలిందని మహిళలు వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కనీసం లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తే సన్న చిన్న కారు రైతులు బాగుపడతారని రైతులు వాపోతున్నారు.

సన్న, చిన్నకారు రైతులకు నిరాశ

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న రాజేంద్ర

ప్రజాశక్తి - కోట : ఇటీవలి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన చిట్టేటి ఐశ్వర్యకు రాఘవాపురానికి చెందిన మర్రిబోయిన రాజేంద్ర తన స్వగృహంలో కంప్యూటర్ కొనుగోలుకు ఆదివారం 15 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. చిట్టేడు గ్రామానికి చెందిన చిట్టేటి సురేష్, శ్రావణిల పెద్ద కుమార్తె చిట్టేటి ఐశ్వర్య చిట్టేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో 531 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లి దండ్రులను అభినందించి కంప్యూటర్ కొనుగోలుకు 15 వేల రూపాయలు అందించారు. రాజేంద్ర మాట్లా డుతూ భవిష్యత్‌లో ఆమె ఉన్నత చదువుల కోసం సహకరిస్తానని తెలిపారు. ఐశ్వర్య తాను డాక్టర్ అయి పేదలకు ఉచిత వైద్య సేవ చేయడమే తన లక్ష్యం అని పేర్కొంది. చిట్టేటి ఐశ్వర్య తండ్రి సురేష్ సొంత గ్రామమైన నాయుడుపేట సమీపంలో పున్నెపల్లి గ్రామం అని, చిన్న వయసులోనే తల్లి దండ్రులను కోల్పో యా రని గుర్తు చేస్తూ అక్కడి నుండి వారి అమ్మమ్మ , మేన మామ గ్రామమైన చిట్టేడులో స్థిరపడి అప్పటి నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని రాజేంద్ర తెలిపారు. తమ పాప ప్రభుత్వ పాఠశాలలో 531 మార్కులు సాధించడం తమకు చాలా ఆనందంగా వుందని తల్లిదండ్రులు తెలిపారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు రూరల్ మండల పరిధిలోని విందూరు గ్రామం నుండి వైసిపికి చెందిన 30 కుటుంబాల వారు వైసిపి నుండి టిడిపిలో చేరారు. పెంచల కోన ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ స్వగృహంలో వీరికి పార్టీ కండువా కప్పి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ సాదరంగా ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హ యాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిం దన్నారు. చంద్రన్న తోనే అభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించా రు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మిడ్డి పెంచ ల్ రెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, నల్లవడ్ల పట్టాభి రెడ్డి, కార్తీక్ రెడ్డి , మస్తాన్, వెంకటేశ్వర్లు మైనారిటీ నాయ కులు షేక్ చాన్ బాషా, లక్కు కృష్ణ రెడ్డి, పుట్టి గోపాల్ నాయుడు, పిట్టి నాగరాజు మండల నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : హిమజ విద్యాసంస్థల ఛైర్మన్ సురేంద్రరాజు, కుమార్తె రేష్మ ఆధ్వర్యంలో ఆ విద్యాసంస్థల అధినేత నిషీధరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరి, పుత్తూరు, వడమాలపేట, నిండ్ర, విజయపురం, మండల బిజెపి నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై నిషీధ రాజుకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్డీఏ కూటమి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ హాజరయ్యారు. నిషీధ రాజు మాట్లాడుతూ, జరగనున్న ఎన్నికలలో టిడిపి కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అధ్యాపకులు, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో హిమజ విద్యాసంస్థల అధ్యాపకులు, బీజేపీ , టిడిపి, జనసేన నాయకులు, అభిమానులు, పుత్తూరు పట్టణ చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : మాజీ సీఎం చంద్రబాబునాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కోట పట్టణంలోని శ్యామ సుందరపురం కాలనీలో ఆదివారం సీనియర్ పొలిటికల్ లీడర్, టిడిపి నేత నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఇంటి ఇంటి ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. కరపత్రాలు అందజేసి గూడూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్ కుమార్, తిరుపతి కూటమి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ రావును గెలి పించాలని అభ్యర్థించారు. నారా చంద్రబాబు నాయుడు ను గెలి పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ కార్య నిర్వహణ కార్యదర్శి వాకా విజయ్ భాస్కర్ రెడ్డి, టిడిపి కోట మండలం ఉపాధ్యక్షులు పల్లె మల్లు వెంకట కృష్ణ రెడ్డి, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి రాంమోహన్, టిడిపి యువ నేత మోహన్, సుబ్బారావు, సీనియర్ టిడిపి నాయకులు మీజూరు మల్లికార్జున రావు, కారిమేటి నాగేశ్వరావు, కార్తికేయ మినరల్స్ అధినేత రాయపు సుబ్రహ్మణ్యం, శ్రవణ్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: టిడిపి కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయం కోసం అందరూ ఓటర్లకు అవగాహన కల్పించాలని నెలవల రాజేష్ దిశ నిర్దేశం చేశారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ఆ పార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు స్వగ్రామం సింగనాలతోరులో ఏర్పాటు చేసి 42 పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన నిర్వహించారు. మిగిలిన రెండు వారాల్లో కార్యకర్త నుండి, నాయకుని వరకు పార్టీ విజయం కోసం ప్రచారం నిర్వ హించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి టిడిపిని గెలి పించాలని కోరుతూ టిడిపి కూటమి నాయకులతో ప్రచారం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను జకరయ్య, మాజీ ఏకొల్లు ఎంపిటిసి ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, మైనారిటీ సెల్ అధ్యక్షులు షబ్బీర్, సుధాకర్ రెడ్డి, కిషోర్ నాయుడు, పురుషోత్తం యాదవ్, ముత్యాలయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ప్రసాద్ నాయుడు, పలు పంచాయతీల ప్రధాన నాయకులు హాజరయ్యారు.

దొరవారిసత్రంలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కేక్ కట్ చేస్తున్న హిమజ విద్యా సంస్థల అధినేత నిషీధరాజు

ఘనంగా నిషీధ రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హిమజ విద్యాసంస్థల ఛైర్మన్ సురేంద్రరాజు, కుమార్తె రేష్మ ఆధ్వర్యంలో ఆ విద్యాసంస్థల అధినేత నిషీధరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరి, పుత్తూరు, వడమాలపేట, నిండ్ర, విజయపురం, మండల బిజెపి నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై నిషీధ రాజుకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్డీఏ కూటమి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ హాజరయ్యారు. నిషీధ రాజు మాట్లాడుతూ, జరగనున్న ఎన్నికలలో టిడిపి కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అధ్యాపకులు, నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో హిమజ విద్యాసంస్థల అధ్యాపకులు, బీజేపీ , టిడిపి, జనసేన నాయకులు, అభిమానులు, పుత్తూరు పట్టణ చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా: నూకతోటి రాజేష్

ప్రజాశక్తి - సత్యవేడు: తనను ఆదరించి గెలిపిస్తే నియోజక వర్గ ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని సత్యవేడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం స్థానిక జెడ్‌పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైసిపి నేతలతో కలిసి మండలంలోని పెద్దఈటిపాకం, సత్రం, రాచపాలెం, చిన్నఈటిపాకం, పాలగుంట, కొత్తమారికుప్పం, అమావాస్య రెడ్డి కండ్రిగ, కాలము నాయుడుపేట, ఎన్‌ఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో పర్యటించి గెలిపించాలని అభ్యర్థించారు. సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏఎం బాలాజీ రెడ్డి, మాజీ ఆలయ ఛైర్మన్ బుజ్జ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్, బెల్ట్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ప్రజల సమక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దీన్ని గమనించి మళ్లీ వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి దంపతులు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రూబెన్, గోవిందస్వామి, శేఖర్, జయ బాలాజీ, ఎంపిటిసి సరవన, మోహన్ రెడ్డి, బాలయ్య, వైసిపి నాయకులు శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సత్యవేడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

ప్రజలను ఆకర్షిస్తున్న టిడిపి పథకాలు: మాజీ జెడ్పిటిసి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: టిడిపి పథకాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని మాజీ జెడ్పిటిసి కళావతి మహేంద్ర అన్నారు. ఆదివారం బంగారుపాళ్యం మండలంలోని కల్లూరుపల్లి, మహాసముద్రం, కేఎం ఖండిగా పంచాయతీలలో పలువురు వైసీపీ నుండి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన నూతన సంక్షేమ పథకాల్లో ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. పెద్ద ఎత్తున టిడిపిలో చేరారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, సర్పంచ్ ప్రవళిక, కొక ప్రకాష్‌నాయుడు, మాజీ ఎంపిటిసి భారతి, నాయకులు ధరణి, విక్రమ్, వేణు, రమేష్ పలువురు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కళ్యాణపురం ఎస్టి కాలనీ లో యువకులు మహిళలు కలసి 30 కుటుంబాలు. వైసీపీ నుంచి టిడిపిలో మాజీ ఎంపీపీ డిఎన్ ఎలుమలై అమ్ములు ఆధ్వర్యంలో టిడిపిలో చేశారు. నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ చేతులు మీదుగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా. డి ఎన్ ఏలుమలై మాట్లాడుతూ గతంలో వైసీపీలో ఉన్నప్పుడు రోజమ్మ గెలుపు కోసం ఎన్నో పోరాటాలు చేసి గెలిపించాము అయినా ఆమె ప్రవర్తన అరాచకాలు చూసి మనసు ఒప్పుకోలేక దూరమయ్యామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి భాను ప్రకాష్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీరత్నం నాయుడు. చిత్తూరు అధికార ప్రతినిధి చినబాబు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారం టిడిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ కోసం తమ్ముడు నిధి ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ కర పత్రాలను పంచుతూ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి ప్రసాద్ రావును గెలిపించాలని అభ్యర్థించారు. టిడిపి నాయకులతో కలిసి నిధి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకంతో మహిళలకు పెద్దపీట వేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, శ్రీధర్ యాదవ్, పుష్ప రాజ్, సుబ్రహ్మణ్యం, జయరామిరెడ్డి, తుకారాంరెడ్డి, వెంకటేష్ యాదవ్, జ్యోతిశ్వరన్, వెంకటపతి రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

రామకుప్పం: బడుగు బలహీన వర్గాల ప్రజలు బాగుపడాలంటే టిడిపినీ ఆదరించి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా కృషి చేయాలని టిడిపి రాష్ట్ర నేత మునస్వామి, పత్రా నారాయణ చారి, మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కెంచన బల్ల, గొరివి మాకులపల్లి లలో జరిగిన శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అట్టడుగు వర్గాలకు సబ్సిడీ రుణాలు, వృత్తి పనిముట్లు అందించింది అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం రిజ్వేషన్లను అందించగా... వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని దూరం చేసిందన్నారు. ఎస్సీ ఎస్టీలకు చెందిన 28 పథకాలను రద్దు చేసిందని...దీంతో పేదలు మరింత పేదరికం లోకి వెళ్లారన్నారు. పేదలకు అన్ని విధాల అండదండలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగాలంటే టీడీపీ తోనే సాధ్యమవుతుందన్నారు. దీనిని గుర్తించి అందరూ రానున్న ఎన్నికల్లో టీడీపీ కి ఘనవిజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో చిన్న కృష్ణ, చలపతి, సుబ్రీ, నాగభూషణం, రామలింగారెడ్డి, జయశంకర్ చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు

సుపరిపాలన కోసం జగన్‌ను గెలిపించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు 99 శాతం పథకాలు అమలు ఘనత ముఖ్యమంత్రికే చెందిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు పెట్టి ప్రజలకు మంచి చేసిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి మగసాల కృష్ణమూర్తి, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ రెడ్డమ్మ, ఎంపీపీ లు, ఎంపీటీసీలు, స్థానిక సర్పంచ్ కొమ్ము వెంకటేష్, మండల కేంద్రంలోని వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు సిఎం అయితే సూపర్ సిక్స్ పథకాలు: మాజీ ఎంపిటిసిలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సూపర్ సిక్స్ పథకాలు అమలు అవుతాయని మాజీ ఎంపిటిసిలు పేర్కొన్నారు. మండలంలోని జాలరిపల్లి. కడపనత్తం గ్రామాల్లో మాజీ ఎంపీపీ డాక్టర్ కృష్ణవేణి జై కుమార్ గౌడ ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో సందర్భంగా ప్రజలు మేలుకొని ఓటు వేయాలని కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా చంద్రబాబు నాయుడు అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు , నెలకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా 15 వేల రూపాయలు, ప్రతి రైతుకు ఏటా 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకి 1500 రూపాయలు ఆర్థిక సహాయం ప్రతి మహిళకు ఉచిత బస్సు సౌకర్యం సదుపాయాలు కావాలంటే నాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు డాక్టర్ కృష్ణవేణి జై కుమార్ గౌడ్, రాధా కిషోర్ గౌడ, మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, బైరెడ్డిసాయిగౌడు, సాయి ప్రతాప్ గౌడ, మండలంలోని టిడిపి మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి వలసలు

రామకుప్పంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- వెంకటగిరి: వైసిపి నాయకులు, కార్యకర్తలకు పసుపు కండువ కప్పి కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ టిడిపి లోకి ఆహ్వా నించారు. వెంకటగిరి నియోజకవర్గ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్8వ వార్డు పెరివరం గ్రామంలో వైసిపి నాయకులు శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జి మందా వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ గోపి, నాయకులు సుబ్రహ్మణ్యం, నాగరాజు పెంచలయ్య, అధ్యర్యంలో 50 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గంగాధర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు రాజేశ్వరరావు, సత్యనారాయణ, స్థానిక వార్డు నాయకులు, బూత్ కన్వీనర్లు చిరంజీవి, 7వ కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ నాయకులు పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని గొరివిమాకులపల్లి, గాంధీనగర్ గ్రామాల్లోనీ పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఆదివారం టిడిపి రాష్ట్ర నేత మునస్వామి, మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసులు గౌడు, ధనుంజయ్ గౌడు, అరుణ్ కుమార్, వరపుత్ర, శ్రీకాంత్, అశోక్, సుబ్రహ్మణ్యం, మంజునాథ్, కాళీ, వరప్రసాద్ ,సతీష్, ప్రభాకర్, మురళి, రాజు తదితరులకు టిడిపి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. వారు మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి కృషి చేస్తామన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు విరివిగా పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆర్థిక అభివృద్ధి చేసిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో చిన్న కృష్ణ, సుబ్రీ,సలాంసాబ్, రామలింగారెడ్డి, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నాం

ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఇండియా ఫోరం తరపున చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కనుపర్తి శ్రీనివాసులు గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని వేప కుప్పం, నెత్త కుప్పం గ్రామపంచాయతీలలో నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కనుపర్తి శ్రీనివాసు కుమార్తె చంద్రిక కోరారు. తన తండ్రి కనుపర్తి శ్రీనివాసు గెలుపు కోసం ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు రావాలి.... కాంగ్రెస్ అధికారంలోకి రావాలి అని నినాదంతో విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ని ఆదరించాలని ఆమె కోరారు చంద్రగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని ఆమె తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకి ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ను వివరిస్తూ ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో కుమారి, షేక్ మహబూబి, రజిని పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నెల్లూరు సిటీ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్‌ని సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. గూడూరు సిపిఎం నాయకులు జోగి శివకుమార్ బివి రమణయ్య, బిచంద్రయ్య నెల్లూరు పట్టణంలోని శిఖరం వీధి ప్రధాన పోస్టు ఆఫీసు తదితర ప్రాంతాల్లో నెల్లూరు సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు , రెహానా బేగం ఆధ్వర్యంలో నెల్లూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం తోనే పేదల అభ్యున్నతి అని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలన్నారు. నెల్లూరు జిల్లా పార్లమెం ట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు నీ హస్తం గుర్తుపై ఓట్లు వేసి ఇండియా ఫోరం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - సత్యవేడు: 'స్వర్ణాంధ్ర సాకారం కోసం చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా రప్పిద్దాం..' అని టిడిపి అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సత్యవేడు మండలంలోని చెరివి,రామచంద్రపురం, ఆరూరు, చంగంబాకం, కొల్లడం, మదనపాలెం, పెద్దఈటిపాకం, వానెల్లూరు, రాళ్ల కుప్పం,గ్రామాలలో ఆపార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకుడు మునిసుబ్రహ్మణ్యం, నాయకులు సుందరరామిరెడ్డి, మస్తాన్, పరమశివం పాల్గొన్నారు.

యాక్టర్‌ని కాదు డాక్టర్‌ని

• ప్రచారంలో దూసుకుపోతున్న పోతుగుంట

ఎన్నికల ప్రచరాంలో పోతుగుంట రాజేష్‌నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: ఎన్నికల ప్రచారంలో ఇండియా ఫోరం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పోతు గుంట రాజేష నాయుడు దూసుకు పోతున్నారు. అందరిలా తాను ఓట్లు దండుకొనే యాక్టర్‌ని కాదనీ, నిజాయితీగా పనిచేసే డాక్టర్ నంటూ తనని తాను ఓటర్లకు పరిచయం చేసుకుంటున్నారు. ఆదివారం ఆయన తొట్టం బేడు మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో పర్యటించారు. ఈ క్రమంలో ఆయన మంచం మీద కాలు విరిగిన మహిళను చూసి ఒక ఆర్థోపెడిక్స్ డాక్టర్‌గా వైద్య సేవలు అందించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి వారి కుటుంబ సభ్యుల మన్ననలు పొందారు. ఇదే నిజమైన ప్రజా సేవ అని, ఇలాంటి నాయకునికి ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎంతో మంది పేదలకు మంచి జరుగుతుందని డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడును సింగమాల ప్రజలు అభినందించారు.

ఓటు అడిగే హక్కు కమ్యూనిస్టులకే ఉంది

• పదివేల మందికి పైగా సొంత ఇంటి కల నెరవేర్చాం
• అధికార ప్రతిపక్ష పార్టీలవి ఉత్తుత్తి హామీలు మాత్రమే
• ఎన్నికల ప్రచారంలో సిపిఐ అభ్యర్థి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతిలో పేద ప్రజల నివాసం కోసం 22 కాలనీలు నిర్మించి పదివేలమందికి ఇండ్లు ఇప్పించిన ఘనత కమ్యూనిస్టు పార్టీ దేనని కనుక ఓట్లు అడిగే హక్కు కూడా తమకే ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.రామానాయుడు పేర్కొన్నారు. సిపిఐ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.మురళి విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం లెప్రసి ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఆయన సిపిఐ నేతలు టి.జనార్ధన్, సి.పెంచలయ్య, విశ్వనాథ్, రాధాకృష్ణలతో కలసి ఇంటింటి ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ కేవలం ధన బలంతో ఓట్లు పొందాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు భూటకపు హామీలు గుప్పిస్తూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని వారికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. తిరుపతిలో కార్మికులకు, పేదలకు ఒక సెంటు ఇంటి స్థలమైనా ఇప్పించ గలిగారానని ఆయన సవాల్ విసిరారు. సిపిఐ ఆధ్వర్యంలో వేసిన కాలనీలలో సైతం డ్రెయిన్లు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు సైతం కల్పించే పరిస్థితిలో నేడు కార్పొరేషన్, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. తిరుపతిలో రుయా మెటర్నిటీ, ఆసుపత్రులలో సదుపాయాలు మెరుగుదల చేయాలని, సిబ్బందిని పెంచాలని సిబ్బందిని, సిపిఐ ఆధ్వర్యంలో పలు పోరాటాలు చేసామని గుర్తుచేశారు. ప్రసూతి వైద్యశాలను కార్పొరేషన్ కార్యాలయంగా మార్చకుండా పెద్ద ఎత్తున ఉద్యమించిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ఆస్తిపన్ను, చెత్త పన్ను వేసి ప్రజలను దోపిడీ చేస్తుంటే పలుసార్లు పోరాడిన పార్టీ సీపీఐ మాత్రమే నన్నారు. కంకి-కొడవలికి ఓటు వేసి మురళిని శాసన సభకు పంపాలని పేర్కొన్నారు. ఇండియా ఫోరం అసెంబ్లీ అభ్యర్థి పి.మురళి మాట్లాడుతూ రాజీవ్ నగర్, శ్రీనగర్ ఎస్ఎల్వీ నగర్, రాఘవేంద్ర నగర్, చంద్రానగర్‌లలో ఇంటింటి ప్రచారం గావించి పేదల పక్షపాతియైన తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తదుపరి ఆయన మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కేవలం పత్రికల ప్రకటనలకే తప్ప ఈ ప్రాంతంలో అభివృద్ధి మాత్రం కూడా లేదని అన్నారు. ఎస్ఎల్‌వి నగర్ రహదారి సైతం గులకరాళ్ళతో స్వాగతం ఇస్తుందని కార్పొరేషన్ పాలకవర్గం అధికార పార్టీ వివక్షతకు నిదర్శనంగా పేర్కొన్నారు. అసెంబ్లీకి తాను ఎన్నికైతే నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్ధన్, సి.పెంచలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రాధాకృష్ణ జనుమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రైతులకు మేలు..

• ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నగిరి నియోజవర్గం పుత్తూరు మండలంలో మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ కేశవులు ఆధ్వర్యంలో తడుకు పంచాయతీలో వేణుగోపాలపురం, గొల్లపల్లి, పల్లూరు, గోపాలకృష్ణపురం, తొర్రూరు, నేషనూరు, గట్టు ప్రాంతాలలో ఇండియా ఫోరం ఉమ్మడి అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పథకాలు వివరిస్తూ కాంగ్రెస్ రైతుల పక్షపాతి పార్టీ అని, టీడీపీ, వైసీపీలు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయని చైతన్యవంతమైన ప్రజలు ఆలోచన చేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ ఆర్.బాబు, డిసిసి జనరల్ సెక్రటరీలు ఢిల్లీ, చిరంజీవి రెడ్డి, ఎస్సీ నాయకులు రత్నం, నాయకులు లోహితరాజు, రజనీదేశప్ప, దివాకర్, సుమన్, వెంకటేష్, మహేష్, హరీష్, ప్రభాకర్, చిన్ని, సతీష్, రాజా, దేవ, సెంథిల్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో రాకేష్‌రెడ్డి

2న శిక్షణకు తప్పక హాజరు కావాలి: కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: పోలింగ్ సిబ్బంది రెండవ దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈసిఐ నిర్దేశిత వెబ్సైట్‌లో ఎన్నికలు సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్, కే.జ్యోతి సమక్షంలో, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా పూర్తి అయిందని, తద్వారా ఎన్నికల పోలింగ్ విధులు కేటాయించబడిన సిబ్బంది వారికి కేటాయించబడిన నియోజకవర్గ నిర్దేశిత శిక్షణ కేంద్రంలో మే2న శిక్షణకు తప్పక హాజరు కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నిర్దేశిత వెబ్సైట్లో పోలింగ్ సిబ్బంది రెండవ దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియ సాధారణ ఎన్నికల పరిశీలకులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టి పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమీషన్ వారు ఆదివారం పోలింగ్ సిబ్బంది రెండవ దఫా ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ర్యాండమైజేషన్ కోసం సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని, వారి ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డిఈఓ లాగిన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో పోలింగ్ సిబ్బంది రెండవ దఫా ర్యాండమైజేషన్‌ను చేపట్టామన్నారు. ఇందులో ప్రిసైడింగ్ అధికారులు 2094మంది, సహాయ పోలింగ్ అధికారులు 2094మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 8376మంది రిజర్వ్‌తో కలిపి వెరసి మొత్తం 15936మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది రెండవ దఫా ర్యాండమైజేషన్, అలాగే మైక్రో అబ్జర్వర్ ర్యాండమైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రెండవ దఫా పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, అలాగే మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ సజావుగా పూర్తి కావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌వో పెంచల కిషోర్, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ అధికారి ఎస్డిసి చంద్రశేఖర్ నాయుడు, ఐ.టి నోడల్ అధికారి వేంకటేశ్వర రావు, తదితర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆట.. పాట.. మాట.. సమ్మర్ క్యాంప్

• ప్రారంభించిన తిరుపతి జిల్లా డివైఈవో బాలాజీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పిల్లలకు వేసవి సెలవుల్లో ఆటపాటమాట సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. ఆదివారం నుంచి జూన్02 వరకు 35రోజులపాటు క్యాంపు నిర్వహించనున్నారు. ఆదివారం ప్రారంభ సందర్భంగా జరిగిన సభకు టెంకాయల దామోదరం అధ్యక్షత వహించగా తిరుపతి జిల్లా డివైఈవో బాలాజీ మాట్లాడుతూ పిల్లలకు ఈ సెలవు రోజుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటమాట కార్యక్రమాలు ఫన్ విత్ మ్యాథ్స్, తెలుగు, ఇంగ్లీష్, చదవడం, రాయడం, గుండ్రటి చేతివ్రాత, మ్యాజిక్, చెస్, చిత్రలేఖనం, కథల చెప్పడం, దేశభక్తి గీతాలతో డ్యాన్సుల శిక్షణ లాంటి కార్యక్రమాలు రూపొందించి నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. నిరంతరం మనిషి పనిలో ఉంటేనే ఎదుగుదల ఉంటుందన్నారు. పిల్లలు సెలవుల్లో సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ, సెలవులను బాగా గడపాలని సూచించారు. ప్రముఖ గణితవదాని అరుణ శివప్రసాద్ మ్యాథ్స్‌లో ఉన్న భయాలను పోగొట్టి ఆసక్తి పెరిగేలా పిల్లలతో ముచ్చటించారు.

పిల్లలకు అవసరం అయిన నోట్ బుక్స్, చెస్ బోర్డులను H2O సంస్థ మణికంఠ వారి బృందం అందించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, సుంకర రెడ్డెప్ప, ముని లక్ష్మీ, పద్మజ, గురునాదం, ముఖేష్, డ్యాన్స్ మాస్టర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తనదైన శైలిలో ప్రజల సమస్యలు తెసుకుంటూ ఇండియా ఫోరం మ్యానిపెస్టోను ప్రజలకు వివరిస్తూ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి టిక్కీరాయల్ ఇంటింటా ప్రచారంలో దూసుకుపోతున్నారు. వామపక్ష, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం డొడ్డిపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీక్కీ రాయల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తొమ్మిది గ్యారెంటీలతో మేనిఫెస్టోని విడుదల చేసిందని అందులో నెలకు 8,333 సంవత్సరానికి లక్ష రూపాయలు ప్రతి పేద మహిళ ఖాతాలోను జమ చేయబడుతుందన్నారు. రైతుకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం, కేజీ టు పీజీ ఉచిత విద్య, పేదలకు ఇచ్చే పెన్షన్ రూ.4000 అలాగే వికలాంగులకు రూ.6000, ప్రతి పేద మహిళకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం, ప్రత్యేక హోదా 10సంవత్సరాలు గ్యారంటీ, ఉపాధి హామీ కూలీలకి కనీస వేతనం రూ.400 పెంపు, రైతు పెట్టుబడి మీద 50శాతం లాభంతో మద్దతు ధర, మొదటి సంవత్సరం కేంద్రం ద్వారా 30 లక్షల ఉద్యోగాలు అలాగే రాష్ట్రంలో 2.25వేల ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే చిత్తూరు అభివృద్ధికి కట్టబడి ఉంటానన్నారు.

ఇంటింటా ప్రచారంలో ఇండియా ఫోరం అభ్యర్థి టిక్కీ రాయల్